క్లుప్తంగా

రైతుల సమక్షంలో సర్వే రాళ్లు ఏర్పాటు



పెదపూడిలో సర్వే రాళ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

బుచ్చెయ్యపేట: జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే చేసిన గ్రామాల్లో రైతుల సమక్షంలో భూ సరిహద్దులో సర్వే రాళ్లను ఏర్పాటు చేయాలని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ ఆదేశించారు. భట్లోవ, పెదపూడి, పి.పి.అగ్రహారం, చింతపాక తదితర గ్రామాల్లో సర్వే పనులను తహసీల్దార్ అంబేడ్కర్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ముందుగా సర్వే చేసిన పది గ్రామాల్లో రైతుల సమక్షంలో సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆర్డీవో సూచించారు. ప్రభుత్వం ఆశయం మేరకు వేగవంతంగా భూ సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. సర్వేయర్ సింహాచలం, వీఆర్వోలు జెట్టి సుధాకర్, రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్



ఎమ్మెల్యే గణేష్‌ను సత్కరిస్తున్న బార్ ప్రతినిధులు

నర్సీపట్నం: ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా రావాడ సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. బార్ అసోసియేషన్‌కు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నేటి నుంచి ఉచిత ఎంసెట్ కోచింగ్

నర్సీపట్నం: ఎస్ఏఎన్, అరుణ చారిటబుల్ ట్రస్ట్‌ల సహకారంతో నర్సీపట్నంలో ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నామని ఎస్ఏఎన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సూరెడ్డి ఉమామహేశ్వరి తెలిపారు. రామారావుపేటలోని కళాశాలలో బుధవారం నుంచి ఈ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ పేదలకు వరం



బాలింతకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ పేదలకు వరం లాంటిదని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. మంగళవారం ఆమె చమ్మచింతలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులు, బాలింతలు, గర్భిణుల ఇళ్లకెళ్లి వైద్య సేవలు అందించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్థసారథి ఆలయంలో సదస్య మహోత్సవం

మాడుగుల: పురాతన పార్థసారథి ఆలయంలో మంగళవారం సాయంత్రం సదస్య మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పూలతో అలంకరించారు. ఏటా శ్రీరామ నవమి తర్వాత ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకుడు పార్థసారథి స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా బేగం, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, భక్తులు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ



మాడుగులలో కొత్తగా మంజూరైన పింఛను అందజేస్తున్న దృశ్యం

మాడుగుల: మండలంలో 97 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఒక్కపైసా లంచం లేకుండా ఇంటి ముంగిటకే తెల్లవారునే తలుపు తట్టి అందిస్తుండడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా బేగం, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సమ్మంగి జగన్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం పండగ వాతావరణంలో కొనసాగింది. ఏ. కొత్తపల్లిలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లి తొమ్మిది మందికి నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ సరువునాయుడు, పంచాయతీ సెక్రటరీ టి. పవన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పెదనందిపల్లిలో సర్పంచ్ సోమిరెడ్డి సన్నిబాబు, ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ, వేచలంలో సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, కలిగొట్లలో సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి పింఛన్లు అందజేశారు. ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



ఎ. కొత్తపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ



పెదనందిపల్లిలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ సన్నిబాబు, ఎంపీటీసీ నారాయణమ్మ

ఐకమత్యానికి ప్రతీక పండగలు

- గొల్లలపాలెంలో పైడితల్లమ్మకు డిప్యూటీ సీఎం బూడి ప్రత్యేక పూజలు



పైడితల్లమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: గ్రామాల్లో పండగలు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గొల్లలపాలెంలో మంగళవారం పైడితల్లమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై అమ్మవారి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, సర్పంచ్ బండారు ఈశ్వరమ్మలను సత్కరించారు. మహిళల కోలాటాల ప్రదర్శనను తిలకించారు. పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఆర్బీకే చైర్మన్ బండారు అక్కన్న పాత్రుడు పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణశ్రీ



మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాష్

మాడుగుల రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు మెరుగుపడతున్నాయని వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు తెలిపారు. వి.వి.అగ్రహారంలో లక్ష్మీపురం చెరువు పనులను మంగళవారం ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ చెరువు పూడికతీతకు, చెరువుగట్లు పటిష్టతకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, స్థానిక సచివాలయ కన్వీనర్ బోగాది జోగారావు, కోన శివ, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, దాడి రాజేశ్వరావు, ఈసీ ఉమాశంకర్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: జాబ్‌కార్డులున్న అందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో అరుణశ్రీ ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనదారులకు దినసరి వేతనంగా రూ.272 అందుతుందన్నారు. ఈ నేపథ్యంలో గిట్టుబాటు కూలీ అందేలా అవగాహన కల్పించాలన్నారు. నిత్యం ఉపాధి పనులకు అధిక సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. ఏపీవో వరలక్ష్మి, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

5.10 లక్షల పని దినాలు లక్ష్యం

చీడికాడ: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఐదు లక్షల పది వేల పని దినాలు లక్ష్యంగా పని చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. రోజుకు నాలుగు వేల మూడు వందల మందికి పని కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టండి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



అభివృద్ధి పనులపై మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు



పాల్గొన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు

బుచ్చెయ్యపేట: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి లేకుండా రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మండల సమావేశంలో సభ్యులు తీర్మానించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పెదపూడిలో ఏడాదిగా వీఆర్వీ లేక కూలీలకు సంక్రమంగా పనులు కల్పించడం లేదని, విధుల్లో దిబ్బిడి వీఆర్వీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వలసలు పోకుండా గ్రామంలోనే ఉపాధి కల్పించడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణిలో ఉంటున్నారని వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్‌లు గోకివాడ వరర్నష్ణ, పెదిరెడ్ల మాణిక్యం ఏపీవో మురళిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన భీమవరంలో 15 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్ పోస్టును భర్తీ చేయకపోవడంపై సర్పంచ్ బి. మాధవి ఐసీడీఎస్ సిబ్బందిని నిలదీశారు. రెండేళ్లుగా పోలేపల్లిలో మంచినీటి ట్యాంకు శిథిలమై ప్రమాద స్థాయికి చేరి కొత్త ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు చేయకపోవడంపై సర్పంచ్ సీతా బుజ్జి, నేతవానిపాలెంలో మంచినీటి పైపు బాగు చేయించకపోవడంపై పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకరి శ్రీను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరీష్‌పై మండిపడ్డారు. రైతు గ్రూపులో రెండు ట్రాక్టర్లకు సబ్సిడీ నగదు అందించకపోవడంపై చింతపాక సర్పంచ్ గొలజాన శ్రీను ఏవో భాస్కరరావును నిలదీశారు. మల్లాం పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని సర్పంచ్ గొలగాని శ్రీను అధికారులను కోరారు. వడ్డాది కొండ ప్రాంతంలో అనధికార పట్టాలు నిలుపుదల చేయాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు కోరారు. తన జెడ్పీటీసీ నిధులు నుంచి అన్ని గ్రామాల్లో అభివృద్ధికి చర్యలు చేపడతానన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు అధికారులు అవినీతికి తావులేకుండా పనిచేయాలని జెడ్పీటీసీ, ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుడు కె. అచ్చింనాయుడు తదితరులు తెలిపారు. ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, ఎంపీడీవో సువర్ణరాజు, డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్, డీఈ మోహన్, ఎంఈవో చంద్రశేఖర్, జేఈ ప్రభు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాలలో ప్రవేశానికి 2023–24 విద్యా సంవత్సరానికిగాను అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఈ నెల 4 నుంచి 24వ తేదీలోపు htt pr://a pc-f-rr.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతి, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీల భర్తీతో పాటు ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి పరీక్ష మే 20వ తేదీన నిర్వహిస్తామన్నారు.

జోన్ పరిధి దుకాణాలకు వేలం



జెడ్పీ కార్యాలయంలో వేలం పాటలో పాల్గొన్న వ్యాపారస్తులు

అనకాపల్లిటౌన్ : జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ దుకాణాలకు జోనల్ కార్యాలయంలో మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని మెయిన్ రోడ్డులో చేపల బజారుకు, ఎన్టీఆర్ క్రీడామైదానం దుకాణాలకు వేలం నిర్వహించగా ఐదుగురు మాత్రమే పాల్గొన్నట్టు తెలిపారు. క్రీడామైదానం వద్దనున్న నెం.7 దుకాణాన్ని గవరపాలేనికి చెందిన జె.శంకరరావు రూ.26 వేలుకు వేలంలో దక్కించుకున్నట్టు పేర్కొన్నారు. చేపల బజారుకు వేలం పాట మరోసారి నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జోనల్ సూపరింటెండెంట్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్లోవ కొండపై మైనింగ్ లీజులు రద్దు చేయాలి

- ప్రజాభిప్రాయ సేకరణ ఎదుట ప్రజల ఆందోళన



వి.జె.పురంలో ఆర్డీవోకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజలు

మాడుగుల రూరల్: ఉర్లోవ కొండపై మైనింగ్ లీజులు రద్దు చేసి, పట్టాదారుల భూములన్నీ అడంగల్‌లో నమోదు చేయాలని కోరుతూ మంగళవారం వి.జె.పురంలో ప్రజాభిప్రాయ సేకరణ ఎదుట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వి.జె.పురంలో మైఖేల్ అంటోనీకి కలర్ గ్రానైట్ క్వారీ సర్వే నెంబరు 1-13, 1-14, 1-23లో 116 ఎకరాలకు పర్యావరణ అనుమతులు నిమిత్తం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. డీఆర్వో వెంకటరమణ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు పట్టా భూములను వెబ్‌లాండ్ నమోదుతోపాటు కొండపై మైనింగ్ లీజు రద్దు చేయాలని దళితులు, గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ క్వారీ వల్ల గంటికోర్లాం, చినపాచిల పొలాలకు, చెరువులకు తీవ్ర నష్టం కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయాన్ని పట్టించుకోకుండా డీఆర్వో కారెక్కి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు, గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు కె. భవానీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి భజన పోటీలు



భజన పోటీల్లో పాల్గొన్న భజన బృంద సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మంగళవారం నిర్వహించిన బాలాంజనేయ స్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారి శోభాయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్వామివారిని సర్పంచ్ జామి రమణబాబు, టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు దర్శించుకున్నారు. ఇక్కడ తీర్థం సందర్భంగా ఆలయం వద్ద జిల్లా స్థాయి బైటో భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 20 భజన బృందాలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతలుగా విశాఖ స్టీల్‌ప్లాంటు విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.ఎల్.పి.రావు, గోవాడ సుగర్స్ పరిపాలనాధికారి పప్పుల వెంకటరమణమూర్తి(దాసు) వ్యవహరించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

నాతవరం: విద్యా శాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మండలంలో పని చేస్తున్న సీఆర్పీలు, ఇతర కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, కనీసం వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిష్ఠాత్మకంగా ‘జగనన్నే మన భవిష్యత్తు’



గొలుగొండ: మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జలపు మణికుమారి



కె.కోటపాడు: మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్, జేసీఎస్ కన్వీనర్ రాజేష్



మాకవరపాలెం: పైడిపాలలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

గొలుగొండ: గృహ సారథులు ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో ప్రచారంతోపాటు ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. మంగళవారం జోగుంపేట, పప్పుశెట్టిపాలెం గ్రామ సచివాలయాల్లో గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి గ్రామాల్లో పర్యటించాలన్నారు. వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు కొరుప్రోలు ఫణీశాంతారామ్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ కోరారు. మండలంలోని మాకవరపాలెం, బూరుగుపాలెం, పైడిపాలలో మంగళవారం గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై వివరించాలన్నారు. పార్టీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, పార్టీ నాయకులు భద్రాచలం, పిల్లా శ్రీను, ఎంపీటీసీ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు: గత చంద్రబాబు పాలనలో ప్రజలు పడిన కష్టాలను, అమలు కాని హామీలనూ వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలనూ వివరించాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్ అన్నారు. కె.కోటపాడు, గుల్లేపల్లి, గొండుపాలెం, చౌడువాడ గ్రామ సచివాలయాల పరిధిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్, రాజేష్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకూ మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, మాజీ సర్పంచ్ బండారు రామస్వామి పాత్రుడు, ఆర్బీకే చైర్మన్ దొకల అప్పలనాయుడు, సర్పంచ్‌లు బండారు దేముళ్లు, బండారు కనక మల్లీశ్వరి, దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వంటాకు నారాయణమ్మ పాల్గొన్నారు.

నాతవరం: రానున్న సార్వత్రిక ఎన్నికలో వైఎస్సార్‌సీపీని గెలిపించడమే ధ్యేయంగా పని చేయాలని మండల కన్వీనర్ అడిగర్ల నాయుడు కోరారు. వల్లంపేట, మర్రిపాలెం, డి.యర్రవరం, చెర్లోపాలెం గ్రామ సచివాలయాల్లో గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ముందుగా గృహసారథులు చేయాల్సిన అంశాలను క్లుప్తంగా వివరించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కాపారపు వెంకటరమణ, మహిళా శాఖ మండలాధ్యక్షురాలు కామిరెడ్డి లక్ష్మి, యర్రవరం ఎంపీటీసీ సభ్యులు ఇనపసప్పుల వృష్ప, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, పైల శిరీషా, మాజీ సర్పంచ్ లాలం లోవ పాల్గొన్నారు.

దేవరాపల్లి: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు అన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు మా నమ్మకం నువ్వే జగన్, జగనన్న మన భవిష్యత్ కార్యక్రమంపై జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, యువజన విభాగం మండలాధ్యక్షుడు కర్రి సూరినాయుడులతో కలిసి బోయిలకింతాడ, కలిగొట్ల, తారువ, మారేపల్లి, వేచలం, కొత్తపెంట గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఈ సందర్భంగా మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు రొంగలి వెంకటరావు, అవుగడ్డ కన్నతల్లి, గొర్రుపోటు సుధారాణి, నాగిరెడ్డి శతారినాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అన్నారు. యరకన్నపాలెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పథకాలు అందకుండా అర్హులు ఎవరైనా ఉంటే, వారి వివరాలను సేకరించినట్లయితే ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లి వర్తింపజేస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ శానాపతి వెంకటరత్నం, సర్పంచ్ నారాయణమ్మ, సచివాలయ కన్వీనర్ సుర్ల చంద్రశేఖర్, నాయకుడు నిద్దర శ్రీను పాల్గొన్నారు.

హిందూ ధర్మం అనుసరణీయం



సమావేశంలో మాట్లాడుతున్న వినాయకరావుపాండే

అనకాపల్లిటౌన్ : అన్ని వర్గాలకు ఆచరణీయమైన ధర్మం హిందూ ధర్మమని విశ్వ హిందూ పరిషత్ సామాజిక సమరసత కేంద్ర కార్యదర్శి వినాయకరావుపాండే అన్నారు. స్థానిక గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో మంగళవారం పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని కులాల వారిని సమన్వయం చేసుకుంటూ హిందూ ధర్మ వ్యాప్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయోధ్య రామాలయం నిర్మాణంలో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిషత్ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శులు తనికెళ్ల రవికుమార్, శివశంకర్, పరిషత్ ప్రాంతీయ కార్యదర్శి శ్రీకాళహస్తి పాల్గొన్నారు.

సుమతీ శతకం పద్య పోటీలు



విజేతలకు తెలుగు పద్యాల పుస్తకాలను అందించిన బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో విద్యార్థులకు తెలుగు భాషపై ఆసక్తి పెంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. జీవీఎంసీ నిదానందొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సుమతీ శతకం పద్యాల పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యం, తెలుగు పద్యాల గొప్పతనం తెలిపేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. అంతకు ముందు నిర్వహించిన పద్య పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరుగుర్ని విజేతలుగా ఎంపిక చేసి, వారికి తెలుగు పద్యాల పుస్తకాలను బహుమతులుగా అందించారు.

కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.గాయత్రి, ఉపాధ్యాయులు జె.కల్యాణి, ఎంఎస్ ఫాతిమా, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్‌గుప్తా, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.